క్లుప్తంగా

అవిశ్వాస సమావేశం వాయిదా

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ఎంపీపీపై ఎంపీటీసీలు ప్రవేశ పెట్టిన అవిశ్వాసం సమావేశం వాయిదా పడింది. ఈ మేరకు సిద్దిపేట డివిజినల్ కార్యాలయం నుంచి శుక్రవారం ఎంపీటీసీలకు సమాచారం అందింది. మిరుదొడ్డి ఎంపీపీ గజ్జెల సాయిలుపై మెజార్టీ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించిన విషయం విదితమే. కాగా, లోక్‌సభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఈనెల 27న జరగాల్సిన అవిశ్వాస సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

జీలుగ విత్తనాలు అందజేయాలి



వినతి పత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ రైతులకు జీలుగ విత్తనాలను అందించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ రైతాంగానికి జీలుగ విత్తనాల కొరత తీర్చాలని కోరుతూ సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ కె.శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. నియోజకవర్గంలో వెయ్యి నుంచి 1200 బస్తాల జీలుగ బస్తాలు అవసరం ఉండగా నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం 150 బస్తాలు అందజేశారన్నారు. దీంతో జీలుగ విత్తనాల కొరతతో రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. వ్యవసాయ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శశిధర్

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ళబండి శశిధర్ కోరారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో శుక్రవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీ పనులు చేసే చోట అన్ని రకాల వసతులను సమకూర్చడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. కూలీలు ఉపాధి హామీని హక్కుగా భావించి సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆర్థిక ప్రగతి సాధిస్తారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రసాద్ పోరుబాటలో..

హుస్నాబాద్: అవిశ్రాంత పోరాటయోధుడు నల్లమల గిరిప్రసాద్ పోరుబాటలో పయనిద్దామని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేశ్ అన్నారు. పట్టణంలోని సీపీఐ భవన్‌లో శుక్రవారం గిరి ప్రసాద్ 27వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం వెట్టి చాకిరి నిర్మూలనకు జరిగిన ప్రజాపోరాటానికి గిరిప్రసాద్ నాయకత్వం వహించాడన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ములుగు పోలీస్ స్టేషన్ సందర్శన

ములుగు(గజ్వేల్): గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి శుక్రవారం ములుగు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఏఎస్‌ఐ ప్రేమ్‌రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

సిద్దిపేటజోన్: బుద్ధుడు విగ్రహాన్ని సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాబు మాట్లాడుతూ కోమటిచెరువు ప్రాంతంలో బుద్ధుని విగ్రహంతోపాటు ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, సదన్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ధరణిలో సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: ధరణి సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య పేర్కొన్నారు. మండల పరిధి అహ్మదీపూర్ గ్రామానికి సంబంధించిన భూరికార్డులను సరిచేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాల్చొద్దు.. కలియదున్నండి

- అవగాహన లేమితో వరి కొయ్యల కాల్చివేత
- భూమిలోనే కలియదున్నితేనే లాభం
- పంట దిగుబడి పెరుగుతుందన్న అధికారులు
- చర్యలు చేపట్టిన వ్యవసాయ శాఖ



జనగామలో తగలబడుతున్న వరికొయ్యలు

వానాకాలం, యాసంగి సీజన్‌లలో దాదాపు లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. పంటను కోయించిన తర్వాత రైతులు వరి మొదళ్లు (కొయ్యలను) కాల్చుతున్నారు. దీంతో రైతులకు ఉపయోగం కంటే నష్టమే ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరి కొయ్యలను కలియదున్నితే భూసారం పెరిగి ఆశించిన దిగుబడి వస్తుందంటున్నారు. ఇందుకోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది.

అక్కన్నపేట(హుస్నాబాద్): గతంలో పంటల అవశేషాలు (చెత్తాచెదారం, పత్తి కట్టె, వరి కొయ్యలు) తగులబెట్టకుండా భూమిలోనే దున్నేవారు. ప్రస్తుతం వరికొయ్యలు కాల్చుతుండటంతో ఎన్ని ఎరువులు చల్లినా పంట దిగుబడి తగ్గుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులను చైతన్య పరిచేందుకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మోతాదుకు మించి రసాయనాలు

పంట దిగుబడికి వాతావరణం, నాణ్యమైన విత్తనాలే కారణమని చెబుతుంటారు. దిగుబడి కోసం భూమిలో మోతాదుకు మించి రసాయన ఎరువులు చల్లడంతో భూసారం తగ్గుతుంది. భూమిలో సేంద్రియ ఎరువులు చల్లడం వల్ల భూసారం పెరుగుతుంది. భూమిలో సహజ సిద్ధంగా ఉండే నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను సూక్ష్మజీవులు మొక్కకు అందిస్తూ పెరుగుదలకు సహకరిస్తాయి.

సేంద్రియ కర్బనం అంతంతే

భూమిలో పశువులు, గొర్రెలు, కోళ్ల ఎరువును భూమిలో చల్లి కలియదున్నితే పచ్చిరొట్ట ఎరువులతో భూమిలో సేంద్రియ కర్బనం ఏర్పడుతుంది. రైతులు ఎక్కువ శాతం సేంద్రియ ఎరువులు చల్లడం లేదు. కలుపు మొక్కలు, పత్తి కట్టె, వరి కొయ్యకాళ్లు భూమిలో కలియదున్నాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నా రైతులు వారి సలహాలు పాటించడంలేదు. రొటోవేటర్‌తో దున్నితే పంట అవశేషాలు భూమిలో కలిసిపోయి, పెద్దగా రసాయన ఎరువుల అవసరం లేకుండా పండించవచ్చు.

ఒకరిని చూసి మరొకరు

ఒక రైతును చూసి మరో రైతు పంట అవశేషాలను కాలుస్తున్నాడు. దీంతో భూమిలో ఉండే సూక్ష్మ జీవులు చనిపోతున్నాయి. పొగతో వాతావరణం కలుషితమవుతుండటంతో పాటు శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కొన్నిసార్లు భూమిలోని అవశేషాలు తగలబెడుతున్న సమయంలో సమీప మామిడి చెట్లు, హరితహారం మొక్కలు, విద్యుత్ వైర్లు, మోటార్లు కాలిపోతున్నాయి.

> **వరికొయ్యలను భూమిలో దున్నితే లాభం**
>
> 
>
> భూమిలో పంట అవశేషాలను కలియదున్ని, ఎకరాకు మూడు బస్తాల సింగిల్ సూపర్ పాస్ఫెట్ చల్లితే భూమిలోనే ఎరువుగా ఉపయోగపడుతుంది. రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు 50 శాతం తగ్గుతుంది. రైతులకు అవగాహన లేక వరి కొయ్యలను కాల్చుతుండటంతో నష్టం వాటిల్లుతుంది. జనగామ రైతు వేదిక క్లస్టర్ పరిధిలో వరి కొయ్యలను కాల్చకూడదని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.
>
> – శ్రీలత, ఏఈఓ, జనగామ క్లస్టర్

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

- వ్యక్తిగత మరుగుదొడ్లు కట్టుకోవాలి
- ఎంపీడీఓ భానోతు జయరాం



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానోతు జయరాం

అక్కన్నపేట(హుస్నాబాద్): వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఎంపీడీఓ భానోతు జయరాం అన్నారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. భూగర్భ జలాలు పెంపునకు ఇంకుడు గుంతలు దోహదపడతాయన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే రూ.6,300 ప్రభుత్వం అందిస్తుందన్నారు. అదే విధంగా ప్రతీ ఇంటి యజమాని వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉపాధి హామీ పనుల్లో అక్కన్నపేట మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు ప్రతీ రోజు ఓఆర్‌ఎస్, తాగునీరు, నీడ కోసం టెంట్ ఏర్పాటు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. చెరువుల పూడికతీత పనులద్వారా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బోడ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



దిలాల్‌పూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీదేవి

గజ్వేల్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా ఉపాధి హామీ ప్రత్యేక అధికారి శ్రీదేవి ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని దిలాల్‌పూర్, శేరుపల్లి గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలకు రూ. 300 దినసరి కూలీ వచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, కూలీలకు ఎండ తగలకుండా షెడ్‌నెట్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీడీ బాలాజీ, ఎంపీవో దయాకర్, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి నాగేందర్, ఏపీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, వెంకటరెడ్డి, ఎఫ్ఏ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై నిఘా పెట్టండి

వర్గల్(గజ్వేల్): నకిలీ విత్తనాలు, విడి విత్తనాలపై పటిష్ట నిఘావేసి మార్కెట్లోకి రాకుండా అడ్డుకట్ట వేయాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్ సందర్శించారు. కేసుల పరిశోధన, పురోగతిని ఎస్‌ఐ శివకుమార్‌ను అడిగి తగు ఆదేశాలిచ్చారు. స్టేషన్‌లో 5ఎస్ అమలుతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ బెలబుల్ వారెంట్లు, సమన్లు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, విడి విత్తనాలపై నిఘా వేయాలని, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేయా లన్నారు. డయల్ 100 కు స్పందించాలని, ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాకు అడ్డుకట్టపడేలా యంత్రాంగం పనిచేయాలన్నా రు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

క్రీడల్లో రాణించినపుడే గుర్తింపు

బాలల సంక్షేమ సమితి జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహులు



ప్రశంసా పత్రాలను అందజేసిన నిర్వాహకులు

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించినపుడే మంచి గుర్తింపు లభిస్తుందని బాలల సంక్షేమ సమితి జిల్లా కమిటీ సభ్యుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింహులు పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిశ్చంద్రప్రసాద్ నేతృత్వంలో కొనసాగిన వేసవి శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వేసవి శిబిరాల ద్వారా క్రీడాకారులు తమ నైపుణ్యం పెంచుకునే అవకాశముంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ ప్రతినిధులు రాజేందర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

గుంతల తవ్వకంపై ఫిర్యాదు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తారా అపార్ట్‌మెంట్ యజమానులు బండారు సంధ్యారాణి, బండారు రాంఫణిధర్‌రావు తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకు సౌకర్యాలు కల్పించకపోగా పక్కనే మరో అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం పిల్లర్ల కోసం గుంతలు తవ్వడంతో ప్రమాదం పొంచి ఉందని అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, మున్సిపల్ కమిషనర్ నర్సయ్యలకు ఫిర్యాదు చేశారు. తాము నివాసముంటున్న అపార్ట్‌మెంట్ నాణ్యత తక్కువగా ఉందని, పక్కనే మరో అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం గుంతలు తీయడంతో ప్రమాదం జరిగే అవకాశముందని, ఈ విషయంపై మాట్లాడితే రాంఫణిధర్‌రావు బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో ఆరోపించారు. నిర్మాణ పనులు చేపడుతున్న యజమానులతో పాటు కాంట్రాక్టర్లు గుడాల రాధాకృష్ణ, శేఖర్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలి

డీపీఓ దేవకీదేవి



డంపుయార్డును పరిశీలిస్తున్న డీపీఓ దేవకీదేవి

జగదేవ్‌పూర్(గజ్వేల్): చెత్తను రోడ్లపై పారబోయకుండా డంపుయార్డులో వేసేలా చర్యలు తీసుకోవాలని డీపీఓ దేవకీదేవి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో డంపుయార్డు, నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపుయార్డులో వేసి కంపోస్టు ఎరువుగా తయారు చేసి, ఆ ఎరువును నాటిన మొక్కలకు వాడేలా చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, హరితహారం కార్యక్రమానికి సిద్ధం చేయాలన్నారు. అలాగే క్రీడా ప్రాంగణాలను వినియోగంలోని తేవాలన్నారు. రానున్న వానకాలం దృష్ట్యా ముందస్తుగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ శ్రీనివాస్‌వర్మ, కార్యదర్శి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించండి



కడవేర్గులో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ కరుణాకర్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 27వ తేదీన జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ పట్టభద్రులను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని కడవేర్గులో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గదరాజు యాదగిరి ఆధ్వర్యంలో రాకేష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి గదరాజు చందు, గ్రామ అధ్యక్షుడు సిద్దులు పాల్గొన్నారు.

అయినాపూర్‌లో..

కొమురవెల్లి(సిద్దిపేట): వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని మద్దతుగా ఆ పార్టీ నాయకులు శుక్రవారం మండలంలోని అయినాపూర్, మర్రిముచ్చాల గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మెరుగు కృష్ణ,బాల్‌రెడ్డి, నర్సింగరావు, వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు.

దూల్మిట్టలో..

మద్దూరు(హుస్నాబాద్): వరంగల్, ఖమ్మం, నల్గొండ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సిరిసిల్ల జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట ఆగాయ్యయాదవ్ పట్టభద్రులను అభ్యర్థించారు. శుక్రవారం దూల్మిట్ట మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు మొదటి ప్రాధ్యానత ఓటు రాకేష్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు దుబ్బుడు వేణుగోపాల్‌రెడ్డి, నాచగొని వెంకట్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



ఆకునూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ గెలిపించాలని ఆ పార్టీ నాయకులు అభ్యర్థించారు. శుక్రవారం మండలంలోని అయినాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలసి తీన్మార్ మల్లన్నకు తమ మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు అఖిల్‌పాషా, నాగరాజు, పుట్ట రమేష్, మల్లం బాలయ్య, చెరుకు రమణారెడ్డి, తురాయి నవీన్, జంగిని రవి, శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లా చేసింది ఏమీలేదు

చేర్యాల(సిద్దిపేట): వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఆకునూరులో కాంగ్రెస్, సీపీఐ నాయకులు మల్లన్నకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గతంలో గెలిచిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టభద్రులకు చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆకుల రాజుగౌడ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆగడాలను అడ్డుకోండి



మాట్లాడుతున్న దాసరి ప్రశాంత్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో కార్పొ రేట్ విద్యా సంస్థల ఆగడాలను విద్యాశాఖ అధికారులు అడ్డుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా పుట్టగొడుగుల్లా కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయన్నారు. ఈ విద్యాసంస్థలు విద్య పేరుతో వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. జిల్లాలో ఒక పాఠశాలతో పర్మిషన్ తీసుకొని ఇతర ప్రాంతాల్లో బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారన్నారు. కనీస మౌలిక వసతులు కల్పించని పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దరఖాస్తుల స్వీకరణ

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలోని కేజీబీవీలో 6వ తరగతి ప్రవేశాల కోసం మే 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్, 5వ తరగతి చదివినట్లు బోనఫైడ్, బ్యాంక్ అక్కౌంట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 78931 63472 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

◆ ఎంఈఓకు పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక):అనారోగ్యానికి గురై దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న మిరుదొడ్డి ఎంఈఓ ప్రభుదాసును ఎంపీపీ గజ్జెల సాయిలు శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం, కాంగ్రెస్ యూత్ నాయకుడు చెన్నై భూపాల్ గౌడ్, అల్వాల మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య తదితరులు ఉన్నారు.

◆ వర్గల్ తహసీల్దార్‌కు వినతి

వర్గల్(గజ్వేల్): రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం వర్గల్ మండల బీజేపీ అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ బాల్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. అన్నిరకాల వడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వాలని, అకాల వర్షాలకు రైతులు ఇబ్బంది పడకుండా వడ్లు కొనుగోలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, పెట్టుబడి సాయం, సబ్సిడీ పరికరాలు అందించాలని కోరారు.

◆ డ్రైనేజీ నిర్మాణంపై నిర్లక్ష్యం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఎస్సీ కాలనీ నుంచి రామసాగరం గ్రామానికి వెళ్లే దారిలో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి రూపేష్ ఆరోపించారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా పనులు కొనసాగుతుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంగెం మధు తదితరులు పాల్గొన్నారు.

◆ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌లో హైనా దాడిలో 65 గొర్రెలు మృతి చెంది తీవ్రంగా నష్టపోయిన పున్నం మల్లయ్య కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ పరామర్శించారు. ఆ కుటుంబానికి మనో ధైర్యం కల్పించారు. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

◆ చెట్లు తొలగించాలి

సిద్దిపేటజోన్: విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణికి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ వైర్ల చుట్టూ ఉన్న చెట్లను తీలగించాలని, వర్షాలు, ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పలు 33 కేవీ సబ్‌స్టేషన్‌లలో 33 ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నందున ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. మాచాపూర్, కమ్మర్లపల్లి, అల్లీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు గమనించాలన్నారు.

బంగ్లావెంకటాపూర్‌లో..

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్ 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బీబీపూర్ 33 కేవీ పరిధిలోని ధర్మారెడ్డిపల్లి, ఎల్కల్, బేగంపేట, మజీద్‌పల్లి, బంగ్లావెంకటాపూర్, నెంటూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

◆ నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ గ్రామానికి చెందిన నిసాని రాజమల్లు బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు.

◆ పెద్దమ్మ ఆలయంలో చోరీ

రాయపోలు(దుబ్బాక): పెద్దమ్మ ఆలయంలో దుండగులు చోరీ పాల్పడ్డారు. ఈ సంఘటన రాయపోలు మండలం అనాజీపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని చెరువుకట్ట సమీపంలోఉన్న పెద్దమ్మ ఆలయం గేటుకు రోజూ మాదిరిగానే గురువారం రాత్రి కాపలాదారుడు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారు జామున పెద్దమ్మ ఆలయం వైపు వెళ్లిన హనుమాన్ భక్తులు గేటు తాళాలు పగులగొట్టిన విషయాన్ని గమనించి ముదిరాజ్ కులస్తులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి వివరాలు సేకరించారు. హుండీని ఆలయా నికి కొద్ది దూరంలో గుర్తించారు. అందులో రూ.10 వేలకుపైగా నగదు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా రథోత్సవం



చౌదర్‌పల్లిలో దుబ్బరాజేశ్వర స్వామి రథోత్సవం

దుబ్బాక: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చౌదర్‌పల్లిలో స్వామి వారి రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయం నుంచి దుబ్బరాజేశ్వరస్వామి రథం ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు ఆలయానికి భారీగా తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.